సాక్షి
బాపట్ల
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



కొల్లూరు మండలం దోనెపూడి వద్ద కరకట్టకు పడిన గండికి ఇసుక బస్తాలు అడ్డువేస్తున్న గ్రామస్తులు



రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెం వద్ద పడవలపై బాధితులను పునరావాస శిబిరాలకు తరలిస్తున్న దృశ్యం

లంకలు కకావికలం

కృష్ణమ్మ ఉధృతితో మునిగిన లంక గ్రామాలు

- కృష్ణానదికి కనివినీ ఎరుగని రీతిలో వరద
- 26 గ్రామాలను ముంచెత్తుతున్న నీళ్లు
- 9 వేల ఎకరాలకు పైగా వాణిజ్య పంటలకు నష్టం
- వరద ముంపులో 20 వేల మంది
- వేలాది గృహాల్లోకి వరద నీరు
- ఇళ్ల పైకప్పుల పైనుంచి ప్రవహిస్తున్న వరద
- నిరాశ్రయులైన తీరప్రాంతవాసులు
- అరకొరగానే ప్రభుత్వ సాయం
- భయపెడుతున్న కాల్వలకు గండ్లు



కొల్లూరు మండలం కరకట్ట దిగువవైపు ముంపుతో నిండిన లంక ప్రాంతం

సాక్షిప్రతినిధి, బాపట్ల,కొల్లూరు, రేపల్లె రూరల్, పిట్టలవానిపాలెం, వేమూరు: కృష్ణమ్మ విలయానికి నదీ తీర గ్రామాలు కకావికలమయ్యాయి. మునుపెన్నడు ఎరుగని రీతిలో వరద నీరు పోటెత్తుతుండటతో గ్రామాలకు గ్రామాలు వరద నీట మునిగాయి.వరద తీవ్రత అంతకంతకూ పెరుగుతుండటంతో వేలాది ఎకరాలల్లోని వాణిజ్య పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా, కృష్ణా జల ప్రళయం ధాటికి లంక గ్రామాలలో 80 శాతం పైగా ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ప్రాణాలు దక్కించుకునేందుకు దిక్కులు చూస్తున్నారు.

కరకట్టకు లీకులు

రేపల్లె మండలం రావిఅనంతవరం వద్ద కృష్ణానది కరకట్టకు గండి పడే ప్రమాదంపొంచి ఉంది. రావి అనంతరం సమీపంలో కరకట్టకు లీకు ఏర్పడి తారురోడ్డు కింద నుంచి మూడు చోట్ల నీరు కారుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రహదారిపై నుంచి వరద నీరు పారటంతో పాటు రహదారి కింద చెమ్మ వస్తుండటంతో కరకట్టకు గండిపడే ప్రమా దం ఉందని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. కరకట్ట ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీలు పరిశీలించారు.

అన్నదాతను ఆదుకుంటాం

వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈసందర్భంగా ఖాజీపాలెం సినిమాహాలు సెంటర్ నుంచి అలకాపురం, అల్లూరు, పిట్టలవానిపాలెం, చందోలు తదితర గ్రామాలలో నీటి ముంపునకు గురయిన వరి పొలాలను పరిశీలించారు.

పెనుమూడిలో జనకోలాహలం

కృష్ణమ్మ వరద ఉధృతిని చూసేందుకు పరిసర ప్రాంతాలలోని ప్రజలంతా పెనుమూడి చేరుకున్నారు. గత 120 సంవత్సరాలలో ఎన్నడూలేని విధంగా కృష్ణానదిలో రికార్డు స్థాయిలో వరద వస్తుండటంతో వరద పరిస్థితిని తిలకించేందుకు ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం

కృష్ణమ్మ ఉగ్రరూపం దాలుస్తూ కడలివైపు ఉరకలెత్తుతోంది. ప్రకాశం బ్యారేజీలో అన్ని గేట్లు ఎత్తివేయటంతో దిగువకు వస్తున్న వరదనీటితో తీరప్రాంతం బెంబేలెత్తుతోంది. రికార్డు స్థాయిలో వరద నమోదవుతూ కృష్ణమ్మ కడలివైపు పరుగులెత్తుతోంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో 11.38లక్షల క్యూసెక్‌లను విడుదల చేయటంతో కొల్లూరు ప్రాంతం నుంచి కృష్ణమ్మ కరకట్టను తాకుతూ ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ నుంచి ఇంకా వరద నీరు వస్తుండటంతో వరద తాకిడి పెరిగే అవకాశం ఉందని కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద నీటిలోనే పెనుమూడి పల్లెపాలెం గ్రామం నానుతోంది. రికార్డు స్థాయిలో కృష్ణానదికి వరదలు రావటంతో పెనుమూడి పల్లెపాలెంను వరద నీరు చుట్టుముట్టింది. గ్రామంలోని 100 గృహాలు నీట మునిగాయి. గంట గంటకు నీటిమట్టం పెరుగుతుండటంతో గ్రామంలోని 150 కుటుంబాలను పెనుమూడిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.



జలదిగ్బంధంలో భట్టిప్రోలు మండలం చింతమోటు కొత్త కాలనీ

మట్టి అక్రమ తరలింపే గండికి కారణం

నదికి తొలిరోజు ఆదివారం 8.79 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి పెసర్లంక అరవింద వారధి సమీపంలో కృష్ణానది గట్టుకు గండి పడటం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభం నుంచే అధికార పార్టీ నేతలు కృష్ణానదికి ఇరువైపులా ఉన్న కరకట్ట మట్టిని అక్రమంగా తవ్వి వ్యాపారం చేశారు. కరకట్ట వెంబడి పొలాలు ఉన్న రైతులు కట్టమట్టిని తవ్వి కట్టను ఆక్రమించుకుంటున్నారు. దీంతో కరకట్టలు రోజురోజుకు బలహీనపడుతూనే ఉన్నాయి. రేయిపగలు తేడాలేకుండా అక్రమ తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. దీంతో కృష్ణానది కరకట్టలు మరింత బలహీనంగా మారింది.

రేపల్లెలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు

కృష్ణానదికి వరద ఉధృతి అధికంగా వస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా రేపల్లె పట్టణ ప్రజలను అప్రమత్తం చేయటంతో పాటు పలు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి పేర్కొన్నారు. ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అవసరాన్ని బట్టి పట్టణంలో మరిన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

నదీతీర గ్రామాలన్నీ వరద నీటిలోనే...

కృష్ణానది వరద ప్రవాహ తాకిడికి కొల్లూరు, భట్టిప్రోలు మండలాల తీర ప్రాంతంలోని గ్రామాలన్నీ ప్రభావితమయ్యాయి. 26 గ్రామాలు వరద నీటిలో చిక్కుకొని ఉన్నాయి. గ్రామాలన్ని జలదిగ్బంధం అవడంతో పిల్లలు, పెద్దలు, వృద్ధులతో కలిపి సుమారు 20 వేల మంది వరకు వరద ముంపు గ్రామాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వేలాది గృహాల్లోకి వరద నీరు ప్రవహిస్తుండటంతో తీర ప్రాంతవాసులు నిరాశ్రయులయ్యారు. కొల్లూరు మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, కొత్త ఈపూరులంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, క్రీస్తులంక, గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, తురకపాలెం, కృష్ణనగర్, తిప్పలకట్ట, శివరామపురం, కిష్కిందపాలెం, తడికలపూడి, జువ్వలపాలెం, గుంటూరుగూడెం, మధ్యగూడెం, రావిలంకతో కలిపి 22 గ్రామాలు, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, పల్లెపాలెం గ్రామాలతో కలిపి 26 గ్రామాలను వరద నీరు ముంచెత్తుతోంది.

కనిపించని రెవెన్యూ మంత్రి..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు వరదల్లో నీట మునిగినా జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కనిపించక పోవడం చర్చనీయాంశంగా మారింది. పైగా సొంత జిల్లాలోని వేమూరు, రేపల్లె నియోజకవర్గాలు వరద మునకలో ఉన్నా ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించక పోవడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద బాధితులు అధైర్యపడవద్దని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. పెనుమూడి వారధి దోనేపూడి గ్రామం చుట్టుపక్కల లోతట్టు ప్రాంతాల్లోని పరిస్థితులు ఎస్పీ సోమవారం డ్రోన్‌ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లూరు లాకు ప్రాంతం వద్ద డ్రోన్ సహాయంతో అనుక్షణం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామన్నారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ ఉన్నారు.



డ్రోన్ ద్వారా లంక గ్రామాల పరిస్థితులు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

120 ఏళ్లలో కృష్ణమ్మ వరద ఉధృతి వివరాలు

సంవత్సరం	కృష్ణమ్మ వరద ఉధృతి	క్యూసెక్కులు (లక్షల్లో)
1903	అక్టోబర్ 7	10.68
1914	ఆగస్టు 11	9.49
1917	నవంబర్ 2	9.55
1949	సెప్టెంబర్ 24	9.25
1964	అక్టోబర్ 2	9.88
1998	అక్టోబర్ 17	9.32
2009	అక్టోబర్ 5, 6	10.94
2024	సెప్టెంబర్	11.38

(ప్రస్తుతం, మరింత పెరిగే అవకాశం ఉంది)

న్యూస్‌రీల్

33,769 హెక్టార్లలో నీట మునిగిన వరి



బాపట్లటౌన్: నాలుగురోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు జిల్లాలోని రైతన్నలకు కన్నీటిని మిగిల్చాయి. ఇప్పటికే జిల్లాలోని 16 మండలాల పరిధిలో 151 గ్రామాల్లో 40,059 మంది రైతులు సాగు చేసిన 33,769 హెక్టార్ల వరిపైరు నీటమునిగింది. అదేవిధంగా జిల్లాలోని రెండు మండలాల్లోని 15 గ్రామాల పరిధిలో 3806 హెక్టార్ల ఉద్యానపంటలు పూర్తిగా దెబ్బతిని 7327 మంది రైతులు పూర్తిగా నష్టపోయారు.

వరద భయంతో దుకాణాల ముందు గోడలు నిర్మాణం



రేపల్లె రూరల్: వరద భయంతో పట్టణంలోని వ్యాపారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. 2009 సంవత్సరంలో ఓలేరు పల్లెపాలెం వద్ద కరకట్ట తెగటంతో కృష్ణమ్మ రేపల్లె పట్టణాన్ని ముంచెత్తింది. ఆ సమయంలో రేపల్లె పట్టణంలో 4 నుంచి 5 అడుగుల మేర నీరుచేరి నాలుగురోజులపైనే ఉంది. ఆ సమయంలో పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలలో నీరు చేరటంతో వ్యాపారులు రూ.లక్షల్లో సరుకులు నష్టపోయిన పరిస్థితులు ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పట్టణంలోని పలువురు వ్యాపారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం నుంచి హుటాహుటిన తమ వ్యాపార దుకాణాల ముందు 3 నుంచి 4 అడుగుల మేర సిమెంట్ గోడలను నిర్మించుకుని రక్షణ కవచాలు ఏర్పాటు చేసుకున్నారు.

వాహనం బోల్తా.. 20 మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం




చినగంజాం: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలు గాయాలపాలయ్యారు. ఈఘటన సోమవారం ఉదయం చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ కోడూరివారిపాలెం గ్రామానికి చెందిన 22 మంది కూలీలు ఆక్వా చెరువులో పనుల నిమిత్తం నాగాయలంకకు బొలేరో వాహనంలో బయలుదేరారు. జాతీయ రహదారిపై వెళుతున్న వారి వాహనం కడవకుదురు సమీపంలో ఎం3 హోటల్ సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారిలో ముగ్గురు పరిస్థితి విషమం కాగా వారిని మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన 17 మందికి చీరాల ఏరియా వైద్యశాలలో వైద్య చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించిన ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈమేరకు ఘటనాస్థలాన్ని సందర్శించిన ఎస్ఐ ఎస్.రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెంలో బోట్ల సహాయంతో బాధితుల తరలింపు



కొల్లూరు లంక గ్రామాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందబాబు



కొల్లూరు మండలం పెసర్లంక-పెదలంక అరవింద వారధిపై ప్రవహిస్తున్న వరద నీరు

అతికొద్ది మందికే సాయం..



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో వరద నీరు చుట్టుముట్టడంతో సాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు

చుట్టూ నీరున్నా తాగడానికి గుక్కెడు మంచినీరు దొరక్క వరద ముంపులో చిక్కుకున్న బాధితులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ప్రభుత్వ యంత్రాంగం ముంపు గ్రామాలలోని ప్రజలకు పడవల సాయంతో తాగునీటి బాటిళ్లు, ప్యాకెట్లు, భోజనాల ప్యాకెట్లు గ్రామాలలోకి తరలిస్తున్నా అవి అతికొద్దిమందికే చేరుతున్నాయి. మిగిలిన ప్రజలు తాగడానికి నీరు లేక, తాగు నీరు లేని కారణంగా వండుకున్నది తినలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు మాత్రం వరద నీటిలోనే మేత లేకుండా ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది.

గృహాలపై నుంచి వరదనీరు..

పల్లపు ప్రాంతాల్లో ఉన్న గృహాల పైకప్పుల పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటం కృష్ణానది ఉగ్రరూపానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ప్రజలు మెరక ప్రాంతాల గృహాలలో తలదాచుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను సైతం తలకిందులను చేస్తూ వరద నీరు ఆ ఇళ్లలోకి సైతం వస్తుండటంతో మిద్దెల పైభాగంలో కుటుంబాలకు కుటుంబాలు ఆశ్రయం పొందుతూ ప్రాణాలు కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.



వరద నీటిలో భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామం

వాణిజ్య పంటలు 'కృష్ణా'ర్పణం..



కొల్లూరు మండలం ఈపూరు సమీపంలో వరద నీట మునిగిన అరటి తోట

వరద తాకిడికి లంక గ్రామాలలో సాగులో ఉన్న వాణిజ్య పంటలు తుడుచుపెట్టుకుపోయాయి. ఒక్క సెంటు భూమిని వదలకుండా వరద నీరు ముంచెత్తడంతో అరటి, పసుపు, కంద, తమలపాకు, జామ, బొప్పాయి, మొక్కజొన్న, కూరగాయల పంటలు మొత్తం కృష్ణార్పణం అయ్యాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలో సుమారు 9 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వాణిజ్య పంటలను రైతులు పండిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో పంటకు భూమి కౌలుతో కలుపుకొని ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు రైతులు పెట్టుబడుల రూపంలో వెచ్చించడంతో రైతులు నష్టాలపాలవ్వనున్నారు.

సంక్షేమ సంతకం వైఎస్సార్

- వాడవాడలా మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

బాపట్ల: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లాలోని వాడవాడలా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పుష్పాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి నివాళులర్పించారు. మహానేత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నెమరవేసుకున్నారు. బాపట్ల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మహానేత విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టారు. చీరాల నియోజకవర్గంలో మున్సిపల్ చైర్మన్ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసి కారంచేడు గేటు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లులో బండారు ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పర్చూరులో కఠారి అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం నిర్వహించారు. అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. వేమూరు నియోజకవర్గం చుండూరు గ్రామంలో ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేపల్లె నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో చెరుకుపల్లిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చెరుకుపల్లిలో నివాళులర్పిస్తున్న రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



చుండూరు మండలం మోదుకూరులో నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు